ఆ నవ్వులు ఎంతో అవమానకరంగా తోచి మొహం ఎర్రబడింది. బయటకి వచ్చాక దారిలో గురువు ఆ శిష్యుడితో చెప్పాడు.

"నీలో అహం చావలేదని అర్థమైందా? ఇకనించి అందరికీ నీ పేరే చెప్తాండు. 'అహం' అనే ఆ పొర బలమైంది. మన ప్రయత్నంతో అది పూర్తిగా చిరగదు. దైవానుగ్రహంతోనే తొలగిపోతుంది."

అప్పటినించి ఆ శిష్యుడు, ఇతర శిష్యుల్లా దైవానుగ్రహం కోసం ప్రార్థించసాగాడు.

## 35. జమ

ఓ ఊరికి ఓ సిద్ధపురుషుడు వచ్చాడు. ఆయన దగ్గరకి ప్రజలంతా తమ తమ కోరికలతో రావడం మొదలుపెట్టారు. ఎవరైనా ఏదైనా కోరికతో వెళ్ళినప్పుడు ఆయన అది తీరుతుందంటే సత్వరం నిజమయ్యేది. దాంతో తమ కోరికలు నివేదించుకోవడానికి ప్రజలు ఆయన దగ్గరకి తండోప తండాలుగా రాసాగారు.

ఐతే, ఆయన అందరితో 'నీ కోరిక తీరుతుందిపో' అనేవాడు కాదు. కేవలం కొందరితోనే ఆ ముక్క అనేవాడు. ఆయన అనడమేమిటి, ఎంత గట్టి రోగమైనా తగ్గేది. ఆర్థిక బాధలు తొలగేవి. పిల్లల చదువుల్లో అభివృద్ధి కనిపించేది. ఆస్తి తగాదాలు సత్వరం పరిష్కారమయ్యేవి. కాని, కొందరు ఎంత చిన్న కోరిక కోరినా అది తీరుతుందనేవాడు కాదు.

వాళ్ళల్లో ఓ భక్తుడు నిత్యం ఆయన దగ్గరకి వచ్చి తన జీతంలో ఓ పాతిక రూపాయలు ఇంక్రిమెంట్ వచ్చేలా చేయమని కోరసాగాడు. సాధువు మాత్రం మిన్నకుండేవాడు. ఆయన ఊరు విడిచి వెళ్ళే రోజు కూడా ఆ భక్తుడు వచ్చి తన చిన్న కోరికని తీర్చమని వేడుకున్నాడు.

అప్పుడు సాధువు అతని వంక వాత్సల్యంగా చూస్తూ చెప్పాడు.

"మీ కోరికలు తీరడానికి నా మహాత్యమే కారణమని నువ్వనుకుంటున్నావు. కాని అది సరికాదు. బ్యాంక్ కేషియర్ దగ్గరకి వెళితే, కొందరికి అతను లక్షలు చెల్లిస్తాడు. కొందరికి వేలు ఇస్తే మరికొందరికి వందలే ఇస్తాడు. వాళ్ళు తమ ఖాతాల్లో జమ చేసుకున్నదాంట్లోంచే ఆ కేషియర్ ఇస్తున్నాడు తప్ప తన జేబులోంచి తీసివ్వడం లేదు కదా? మహాత్ములు కూడా ఆ బ్యాంక్ కేషియర్ లాంటివారే. తమని కోరేవారు ఆ కోరిక తీర్చుకోవడానికి సరిపడే పుణ్యం ముందే జమ చేసుకుని వుంటే, దాన్ని తీరుస్తారు. జమ లేకపోతే ఎవరూ ఏంచేయలేరు. కనుక వెళ్ళి భజన, నామస్మరణ, సేవ లాంటి పుణ్యకార్యాలు చేయడం మొదలు పెట్టు. పుణ్యం అనే బేంక్ బేలన్స్‌ని పెంచుకుంటే నువు కోరుకుంది నీకు దక్కుతుంది. ఎవరినీ అడగక్కర్లేదు."

తర్వాతి సంవత్సరం ఆ సాధువు ఆ ఊరికి మళ్ళీ వచ్చాడు. అతను తిరిగి సాధువుని కలిసి ఆయన చెప్పినట్లే చేస్తున్నానని చెప్పాడు.

"పాతికేం ఖర్మ. నీకు వంద రూపాయల ఇంక్రిమెంట్ వస్తుంది పో." చెప్పాడు సాధువు.

## 36. ఆలోచనా గంగ

కర్మవశాత్తూ ఒకతనికి కుష్టువ్యాధి వచ్చింది. అన్నిరకాల వైద్యాలు చేయించాడు. ఐనా అతని వ్యాధి తగ్గలేదు. కాశీకి వెళ్ళి గంగలో స్నానం చేస్తే ఆ వ్యాధి నయమవ్వచ్చని ఎవరో చెప్పారు.

"మనుషుల పాపాలని స్వీకరించడానికే గంగ భగీరథుడి వెంట స్వర్గలోకం నించి భూమి మీదకి వచ్చింది." చెప్పారు వాళ్ళు.

అతనికి ఆశ కలిగింది. చాలా రోజులు ప్రయాణం చేసి కాశీ చేరుకున్నాడు. అతనికి ఎంతో కుతూహలంగా వుంది. నిజంగా ఈ రోగం గంగా స్నానంతో పోతుందా? అనుకుంటూ, చీకటి పడటంతో ఓ చెట్టు కింద విశ్రమించాడు.